క్లుప్తంగా

ఆలయ అభివృద్ధికి విరాళం



విరాళాన్ని అందిస్తున్న దాతలు

గాలివీడు : మండల కేంద్రంలోని గేటు నాలుగు రోడ్డు కూడలిలో ఉన్న రామాలయం అభివృద్ధికి రూ.1,01,116లు ప్యారంపల్లె గ్రామానికి చెందిన మాజీ మండల ఉపాధ్యక్షులు గీదర ఈశ్వర్‌రెడ్డి, కుమారులు ధర్మారెడ్డి(ఎన్‌ఆర్‌ఐ), నాగభూషన్‌రెడ్డిలు ఆలయ కమిటీ సభ్యులకు మంగళవారం విరాళంగా అందించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు బ్రహ్మానందరెడ్డి, ప్రమోద్‌స్వామి, వీరారెడ్డి, సిద్దారెడ్డి, రామూర్తి, ఉమాపతిరెడ్డి, మధు, రెడ్డప్పరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టండి



మాట్లాడుతున్న ఎంపీడీఓ కుళ్లాయిస్వామి

ఓబులవారిపల్లె : మండలంలోని అన్ని పంచాయతీలలో అభివృద్ధి పనులకు ఆటంకం కలుగకుండా జరిపించాలని ఎంపీడీఓ కుళ్లాయిస్వామి సూచించారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో అభివృద్ధి పనులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎక్కడా ఉల్లంఘనలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. పంచాయతీలలో తాగునీరు సమస్య తలెత్తకుండా చూడాలని, పారిశుధ్య పనులు, అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ రామమోహన్, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన ఉండాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న తహసీల్దారు

రైల్వేకోడూరు : విద్యార్థులకు ఓటు హక్కుపై అవగాహన ఉండాలని, తల్లిదండ్రులకు కూడా ఓటు హక్కు వినియోగించుకునే విధంగా తెలియజేయాలని తహసీల్దారు శివరాముడు తెలిపారు. మంగళవారం హెచ్‌ఎమ్‌ఎమ్ హైస్కూల్‌లో స్వీప్ యాక్టివిటీస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఓటు హక్కు అవగాహన సదస్సు నిర్వహించారు. ఓటు విలువను తెలియజేశారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకునే విధంగా అవగాహన కల్పించాలని చెప్పారు.

బీమా అందజేత



బీమా చెక్కును అందజేస్తున్న దృశ్యం

పుల్లంపేట : పుల్లంపేట మండలం చెర్లోపల్లి గ్రామానికి చెందిన ఇండ్లూరి వెంకటసుబ్బమ్మ అనే మహిళ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. ఆమెకు ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకులో ప్రధాన మంత్రి జీవనజ్యోతి బీమా ఉండటంతో వారి కుటుంబ సభ్యులకు మంగళవారం బ్యాంకు మేనేజర్ శ్రీనివాసులు చేతుల మీదుగా రూ.2లక్షల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో బ్యాంకు అధికారులు విజయ్, శశికల, వెంకట్రావు, జగ్గుబాయ్ పాల్గొన్నారు.

ఖాళీ బిందెలతో నిరసన

లక్కిరెడ్డిపల్లె : అనంతపురం గ్రామం దళితవాడలో తాగునీటి సమస్యకు అధికారులు పరిష్కారం చూపాలని ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. బోర్లు, చేతిపంపులు వర్షాలు లేక అడుగంటిపోయాయని, తాగునీరు లేక ఇబ్బంది పడుతున్నామని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చొరవ చూపి ట్యాంకర్ల ద్వారా తమ గ్రామానికి తాగునీటిని సరఫరా చేయాలని వారు కోరారు.

ఆత్మహత్యలపై న్యాయ విచారణ చేపట్టాలి

కడప సెవెన్‌రోడ్స్ : ఒంటిమిట్ట మండలం మాధవరం గ్రామంలో చోటుచేసుకున్న చేనేత కుటుంబానికి చెందిన వారి ఆత్మహత్యలపై కలెక్టర్ ఆధ్వర్యంలో న్యాయ విచారణ చేపట్టాలని అఖిలపక్ష నాయకులు మంగళవారం డీఆర్వో గంగాధర్‌గౌడ్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. మృతుని కుమార్తెకు ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వడంతోపాటు భూమిని ఆన్‌లైన్ చేసి పట్టాదారు పాసుపుస్తకం మంజూరు చేయాలన్నారు. ఒక్కొక్క మృతునికి రూ. 25 లక్షలు చొప్పున పరిహారం చెల్లించాలన్నారు. భూ అక్రమాలకు పాల్పడిన అప్పటి తహసీల్దార్, రెవెన్యూ అధికారులను ఉద్యోగాల నుంచి తొలగించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర, సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి దస్తగిరిరెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అన్వేష్, లోక్‌సత్తా నాయకుడు దేవర శ్రీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశీస్సులతో మరింత అభివృద్ధి

- సంక్షేమ ప్రభుత్వాన్ని ఆదరించండి
- దుద్యాల గ్రామంలో విస్తృత ప్రచారంలో ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి



మహిళకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి

సంబేపల్లె : జగనన్న పాలనలో సంక్షేమ విప్లవం కొనసాగిందని, సంక్షేమం, అభివృద్ధి పనులు జగన్‌తోనే సాధ్యమని ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని దుద్యాల గ్రామంలో ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి తన ఎన్నికల ప్రచారాన్ని డీసీఎంఎస్ మాజీ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి, రాయలసీమ విద్యాసంస్థల అధినేత ఆనంద్ రెడ్డి, బసిరెడ్డి, మండల కన్వీనర్ ఉదయ్ కుమార్ రెడ్డి, మండల జేసీఎస్ కన్వీనర్ వి.వెంకటరమణారెడ్డి తదితర నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. గ్రామ పంచాయతీలోని ఎనిమిది పల్లెల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించి జగనన్న ప్రభుత్వంలో జరిగిన మేలును ప్రజలకు వివరించారు. మరింత అభివృద్ధి, సంక్షేమం అందాలంటే జగన్‌ను మరోమారు ముఖ్యమంత్రిని చేయాలని, ఫ్యాను గుర్తుకు ఓట్లువేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని శ్రీకాంత్‌రెడ్డి అభ్యర్థించారు.

సంక్షేమ పాలనకు జేజేలు..

అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా, అన్ని ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా ఐదేళ్లపాటు పాలన అందించిన జగన్ సంక్షేమ పాలనకు జనం జేజేలు పలికారు. ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డికి అన్ని ప్రాంతాల ప్రజలు ఆశీస్సులు అందిస్తున్నారు. మా కుటుంబాలకు, పిల్లలకు ఎంతో మేలు జరిగిందని, జగన్‌కు ఓటు వేసి రుణం తీర్చుకుంటామని శ్రీకాంత్‌రెడ్డి ఎదుట ప్రజలు తమ సమాధానాన్ని వెలిబుచ్చారు. అలానే ఆయా గ్రామాల్లోని బీసీలు తమకు ఆర్థికంగా, రాజకీయంగా ప్రాధాన్యత ఇస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి అండగా ఉంటామంటూ శ్రీకాంత్‌రెడ్డికి తెలియజేశారు.

ప్రజలే ఊపిరిగా.. అభివృద్ధే ధ్యేయంగా..

నియోజకవర్గ ప్రజల సంక్షేమమే ఊపిరిగా, అభివృద్ధే ధ్యేయంగా, ప్రాణం ఉన్నంత వరకు మరింత బాధ్యతతో రెట్టింపు ఉత్సాహంతో నియోజకవర్గ ప్రజల రుణం తీర్చుకుంటామని ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి పేర్కొన్నారు. జిల్లా కేంద్రం అవ్వడంతో రాయచోటి రూపురేఖలు మారిపోయాయని, రాబోయే రోజుల్లో మీ అందరి ఆశీస్సులతో నియోజకవర్గ కేంద్రాన్ని నగరాలకు దీటుగా మారుస్తామని తెలియజేశారు. నియోజకవర్గంలో శాంతి ఉండాలంటే వైఎస్సార్‌సీపీ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా నన్ను, ఎంపీగా పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని మెజార్టీతో గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. సంక్షేమ ప్రభుత్వాన్ని ఆదరించాలని ఈ సందర్భంగా ఓటర్లను కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ భాగ్యమ్మ, వడ్డి సుబ్బారెడ్డి, నాగిరెడ్డి, బాబురెడ్డి, పిచ్చిరెడ్డి, ఆంజనేయులు, వెంకట్రామయ్య, వీరభద్ర, ఉదయరెడ్డి, రమణారెడ్డి పాల్గొన్నారు.

ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేయాలి

- ప్రజల గుండెల్లో వైఎస్ జగన్‌ది చెరగని ముద్ర
- వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను మెజార్టీతో గెలిపించండి
- ఎన్నికల ప్రచారంలో రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథరెడ్డి



ప్రచారంలో మేడా రఘునాథ్‌రెడ్డి, అనిల్‌కుమార్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డిలు

సిద్దవటం : సార్వత్రిక ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంను చేసేందుకు ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథ్‌రెడ్డి, రాజంపేట వైఎస్ఆర్‌సీపీ నాయకుడు ఆకేపాటి అనిల్‌కుమార్‌రెడ్డి, సిద్దవటం మండల ఇన్‌చార్జి మేడా మధుసూదన్‌రెడ్డిలు అన్నారు. సిద్దవటం మండలంలోని ఉప్పరపల్లె గ్రామ పంచాయతీలో మంగళవారం వారు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఇల్లు ఇల్లు తిరిగి కరపత్రాలను అందించారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ రాజంపేట ఎమ్మెల్యే అభ్యర్థి ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిలను ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి, వేయించి భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ రాజకీయాల్లో మనం ఎంతో మంది నాయకులను చూసి ఉంటామని, కానీ ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకునే నేతలు అరుదుగా ఉంటారన్నారు. ఆ కోవకి చెందిన వాడే మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అని అన్నారు. పొరపాటున చంద్రబాబు నాయుడు అధికారంలోకి వస్తే మళ్లీ జన్మభూమి కమిటీలను ఏర్పాటు చేసి జగనన్న సంక్షేమ పథకాలను ఎత్తి వేస్తారని పేర్కొన్నారు. మరోసారి మోసపూరిత హామీలతో టీడీపీ నేతలు ఓట్ల కోసం వస్తున్నారని, వారిని నమ్మి మోసపోవద్దని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శి ఏకుల రాజేశ్వరిరెడ్డి, ఎంపీటీసీ చంద్రశేఖర్‌రెడ్డి, సర్పంచ్ బాలాజీ, వైఎస్ఆర్‌సీపీ నాయకులు ఈశ్వరయ్య, కె.వి.సుబ్బయ్య, కనపర్తి సుబ్బారెడ్డి, నాయూబ్ రసూల్, మల్లికార్జున, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నెరవేరిన కొత్రాళ్ల దళితవాడ వాసుల కల

- దశాబ్దాల రహదారి సమస్యకు శాశ్వత పరిష్కారం
- ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డికి, నాయకులకు కృతజ్ఞతలు తెలిపిన దళితవాడ వాసులు



నిర్మాణ దశలో ఉన్న దళితవాడకు వెళ్లే రోడ్డు

సంబేపల్లె : దుద్యాల గ్రామం కొత్రాళ్ల దళితవాడకు ఎన్నో సంవత్సరాలుగా రహదారి లేకపోవడం వల్ల అనేక ఇబ్బందులు పడేవారు. ఈ ప్రాంతానికి వైఎస్సార్ చేయూత కార్యక్రమం కోసం వచ్చిన ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి దృష్టికి కొత్రాళ్ల దళితవాడ వాసులు సమస్యను తీసుకువచ్చారు. రహదారి సమస్యపై స్థానిక ప్రజలతోనూ, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, రాయలసీమ విద్యాసంస్థల అధినేత ఆనంద్ రెడ్డి, బసిరెడ్డి, వడ్డి వెంకటరమణా రెడ్డిలతో శ్రీకాంత్ రెడ్డి చర్చించి రహదారి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఎంపీ మిథున్ రెడ్డి, ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి సూచనల మేరకు నాయకులు చొరవ తీసుకొని వెంటనే రహదారి చుట్టూ ఉన్న రైతులతో మాట్లాడి, ఒప్పించి తమ సొంత నిధులు వెచ్చించి రహదారి నిర్మాణాలకు శ్రీకారం చుట్టారు. ఈ నేపథ్యంలో సదరు రహదారిని స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి సందర్శించి, రహదారి నిర్మాణాలపై సంతృప్తి వ్యక్తం చేసి, రహదారి నిర్మాణానికి కృషి చేసిన వైఎస్సార్‌సీపీ నాయకులను, సహకరించిన రైతులను అభినందించారు. రాబోయే రోజులలో సీసీ రోడ్డును కూడా నిర్మింపచేస్తామని శ్రీకాంత్ రెడ్డి హామీ ఇచ్చారు. ఎన్నో ఏళ్ల రహదారి సమస్య పరిష్కారం కావడంతో దళితవాడ వాసుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. అలానే ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డితోపాటు నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

సారా విక్రేత అరెస్ట్

మదనపల్లె : అక్రమంగా సారా విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు తాలూకా సీఐ ఎస్.శేఖర్ తెలిపారు. మండలంలోని సీటీఎం పంచాయతీ, సీటీఎం క్రాస్‌రోడ్‌లో సారా విక్రయాలు జరుగుతున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో కలిసి దాడి చేశామన్నారు. స్థానికంగా సారా విక్రయిస్తున్న సిరినాద కుమారుడు పవన్ (23)ను అదుపులోకి తీసుకొని అతని వద్ద నుంచి రూ. 4000 విలువైన పది లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. నిందితునిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

30న కనుమలో గంగమ్మ జాతర

మదనపల్లె సిటీ : స్థానిక చిత్తూరు రోడ్డులోని కనుమలో గంగమ్మ జాతర ఈనెల 30న నిర్వహిస్తున్నట్లు దేవదాయశాఖ ఈఓ రమణ తెలిపారు. రాత్రి తిరునాల సందర్భంగా రాత్రి చాందినీ బండ్లు, కీలు గుర్రాలు, బళ్లారి డ్రమ్స్, చెక్కభజనలతో రాత్రి తిరునాల అత్యంత వైభవంగా నిర్వహిస్తామన్నారు. 31న పగలు తిరునాల, సాయంత్రం ఉట్ల తిరునాల జరుగుతుందన్నారు. శనివారం రాత్రి, ఆదివారం ఉదయం భక్తులకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కలు తీర్చుకోవాలని కోరారు.

సారా విక్రేత అరెస్ట్

మదనపల్లె : అక్రమంగా సారా విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు తాలూకా సీఐ ఎస్.శేఖర్ తెలిపారు. మండలంలోని సీటీఎం పంచాయతీ, సీటీఎం క్రాస్‌రోడ్‌లో సారా విక్రయాలు జరుగుతున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో కలిసి దాడి చేశామన్నారు. స్థానికంగా సారా విక్రయిస్తున్న సిరినాద కుమారుడు పవన్ (23)ను అదుపులోకి తీసుకొని అతని వద్ద నుంచి రూ. 4000 విలువైన పది లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. నిందితునిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వారికి నివాళి



నివాళులర్పిస్తున్న ఆకేపాటి అమర్‌నాథరెడ్డి

ఒంటిమిట్ట : రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఆదెన రామచంద్రారెడ్డి, వెంకటసుబ్బారెడ్డిల మృతదేహాలకు రాజంపేట వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆకేపాటి అమర్‌నాథరెడ్డి మంగళవారం నివాళి అర్పించారు. మండల పరిధిలోని నడింపల్లి గ్రామ సమీపంలో ఉన్న జాతీయ రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రామచంద్రారెడ్డి, వెంకటసుబ్బారెడ్డిలు మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఆకేపాటి మృతదేహాలకు నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు సంతాపం వ్యక్తం చేసి వారికి ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజంపేట వైఎస్సార్‌సీపీదే!

- కార్యకర్తలు, నాయకులు కలిసికట్టుగా కృషి చేయాలి
- వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నేత ఆకేపాటి అనిల్‌రెడ్డి



గంపా సుధాకర్ ఇంటిలో నేతలతో సమావేశమైన అనిల్‌రెడ్డి

నందలూరు(రాజంపేట) : సార్వత్రిక ఎన్నికల్లో ఈ సారి కూడా రాజంపేట వైఎస్సార్‌సీపీదేనని, మన జెండా రెపరెపలాడుతుందని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నేత ఆకేపాటి అనిల్‌రెడ్డి అన్నారు. నియోజకవర్గంలోని నాగిరెడ్డిపల్లె అర్బన్ వైఎస్సార్‌సీపీ ముఖ్యనేతలతో ఆకేపాటి అనిల్‌రెడ్డి మంగళవారం రాత్రి భేటీ అయ్యారు. నాగిరెడ్డిపల్లె, అరవపల్లెలోని పలువురు కీలక నేతలను కలుసుకొని వైఎస్సార్‌సీపీ గెలుపు కోసం తీసుకోవాల్సిన అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా అనిల్‌రెడ్డి మాట్లాడుతూ నాగిరెడ్డిపల్లె అర్బన్ ఏరియా వైఎస్సార్‌సీపీకి కంచుకోట అన్నారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అమరనాథరెడ్డికి అత్యధిక మెజార్టీ వచ్చేలా అందరం కలిసికట్టుగా, సమన్వయంతో పనిచేయాల్సి ఉంటుందన్నారు. ప్రజల్లోకి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన సంక్షేమం, అభివృద్ధి తీసుకెళ్లాలన్నారు. ఈ భేటిలో జెడ్పీటీసీ గడికోట ఉషాసుబ్బారెడ్డి, నాగిరెడ్డిపల్లె అర్బన్ మాజీ సర్పంచి భూమన శంకర్‌రెడ్డి, బీసీ నేత గంపా సుధాకర్, వైఎస్సార్‌సీపీ నాయకులు నడివీధి సుధాకర్, ఆకేపాటి జగదీశ్వరరెడ్డి, గుండు గోపాల్‌రెడ్డి, గుండు మల్లికార్జునరెడ్డి, మాజీ సర్పంచ్ కాశీ శివశంకర్, వేల్పుల శైలకుమార్, నాగిరెడ్డిపల్లె పాలకవర్గ సభ్యులు కనక దుర్గయ్య, నాయనపల్లె ఆదినారాయణలతోపాటు కార్యకర్తలు, వైఎస్సార్ అభిమానులు ఉన్నారు.

సచివాలయ సిబ్బంది బాధ్యతతో పనిచేయాలి



సచివాలయం కార్యదర్శులకు సూచనలిస్తున్న మున్సిపల్ కమిషనర్ వాసుబాబు

రాయచోటి అర్బన్ : వార్డు సచివాలయం ఉద్యోగులు, సిబ్బంది బాధ్యతతో పనిచేయాలని మున్సిపల్ కమిషనర్ వాసుబాబు అన్నారు. మంగళవారం ఆయన మున్సిపల్ పరిధిలోని మాసాపేట, వాల్మీకి వీధి, మహబూబ్‌బాషావీధి, బోస్‌నగర్ -1 సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా సచివాలయాల్లోని వార్డు కార్యదర్శులు, వలంటీర్ల హాజరుపట్టికలను పరిశీలించారు. కార్యదర్శులు బయోమెట్రిక్ హాజరును తప్పనిసరిగా వేయాలంటూ సూచించారు. సమయం పాటించాలంటూ ఆదేశించారు. సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా సచివాలయాలు, వార్డు పరిధిలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి తప్పక అమలు చేయాలంటూ తెలియజేశారు. ముఖ్యంగా ఎంసీసీ అమలులో ఉన్నందున ప్రతి ఉద్యోగి, వలంటీర్లు తప్పక ఎన్నికల నియమావళిని పాటించాలన్నారు. ఎవరైనా రాజకీయపరమైన కార్యక్రమాల్లో పాల్గొంటే వారిని వెంటనే ఉద్యోగం నుంచి తొలగించడంతోపాటు చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఆర్ఐ మల్లికార్జునతోపాటు ఆయా వార్డుల కార్యదర్శులు, వలంటీర్లు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



మద్యం బాటిళ్లను పరిశీలిస్తున్న తనిఖీ అధికారులు

రాయచోటి టౌన్ : ఎన్నికల కోడ్ అమల్లో ఉండటంతో స్పెషల్ ఆఫీసర్లు వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి రాయచోటి – సుండుపల్లె మార్గంలోని ఆంజనేయ స్వామి ఆలయం (చెక్ పోస్టు) వద్ద వాహనాలను ఆపి తనిఖీలు చేశారు. ప్రత్యేక అధికారి యూసూఫ్ ఆధ్వర్యంలో అన్ని వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించారు. నిబంధనల ప్రకారం మూడు బాటిళ్ల కన్నా ఎక్కువ మద్యం బాటిళ్లు తీసుకెళ్లడం చట్టరీత్యా నేరమని అలా ఎవరైనా తీసుకెళుతుంటే వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

చంద్రబాబు పర్యటనను అడ్డుకుంటాం

వీఆర్ఎస్ఎస్ పొదల నరసింహులు

మదనపల్లె : వాల్మీకి, బోయలను మోసం చేసిన టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు మదనపల్లె పర్యటనను అడ్డుకుంటామని ఏపీ వాల్మీకి రిజర్వేషన్ సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షులు పొదల నరసింహులు తెలిపారు. 2004 నుంచి 2014 వరకు ప్రతిపక్షంలో ఉన్న చంద్రబాబు.. ఎన్నికల ప్రచారంలో భాగంగా రాయలసీమ జిల్లాల్లో పర్యటిస్తూ వాల్మీకి, బోయలను గిరిజనులుగా గుర్తింపు ఇస్తామని హామీలు ఇచ్చారని గుర్తుచేశారు. అధికారంలోకి వచ్చిన మూడున్నరేళ్ల తర్వాత ప్రొఫెసర్.సత్యపాల్ కమిషన్ వేసి అధ్యయనం చేయించారన్నారు. సత్యపాల్ కమిషన్ నివేదిక ఆధారంగా 2017 డిసెంబర్ 7న అసెంబ్లీ బిల్లును ఎందుకు ప్రవేశపెట్టించలేకపోయారో...? చంద్రబాబే చెప్పాలన్నారు. కేంద్రానికి పంపిన తీర్మానం సిఫారసు బిల్లును రాష్ట్రానికి పంపేశారని, దానిపై చంద్రబాబు ఎందుకు స్పందించలేదన్నారు. అధికారం కోసం వాల్మీకి, బోయలకు మాటిచ్చి మోసం చేసిన చంద్రబాబు, ప్రస్తుతం జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీతో మళ్లీ పొత్తు పెట్టుకోవడం రాజకీయ హైడ్రామా అన్నారు.

జాతీయస్థాయి కర్రసాము పోటీల్లో ప్రతిభ



పతకాలు, ప్రశంసా పత్రాలతో క్రీడాకారులు

రాజంపేట టౌన్ : ఈ నెల 24వ తేదీ నుంచి మూడు రోజులపాటు తమిళనాడు రాష్ట్రం కన్యాకుమారిలో జరిగిన జాతీయస్థాయి కర్రసాము పోటీల్లో రాజంపేట పట్టణానికి చెందిన క్రీడాకారులు ప్రతిభ కనబరచి పతకాలు సాధించారు. ఈ విషయాన్ని సిలంబం మాస్టర్‌లు రెడ్డి ప్రవీణ్, ఉద్దండపు బాలాజీగణేష్‌లు మంగళవారం ఇక్కడి విలేకరులకు తెలిపారు. సురుల్‌వాల్ విభాగంలో టి.శివకుమార్ రజత పతకం, వై.గంగాధర్, టి.రేవంత్‌రెడ్డి కాంస్య పతకాలు సాధించినట్లు తెలిపారు. అలాగే ఈటి విభాగంలో కెఎల్.భరణికుమార్ కాంస్య పతకం, కృతికరెడ్డి రజత పతకం సాధించారన్నారు. జాతీయ స్థాయి పోటీల్లో తమ క్రీడాకారులు పతకాలు సాధించడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు.

మూల్యాంకన కేంద్రంలో సౌకర్యాలు కల్పించాలి

వైవీయూ: పదో తరగతి మూల్యాంకన కేంద్రంలో సౌకర్యాలు కల్పించాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం నాయకులు కోరారు. మంగళవారం కడప నగరంలోని డీఈఓ కార్యాలయంలో డీఈఓ ఎం. అనూరాధను కలిసి వారు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల శివార్జున మాట్లాడుతూ ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని మూల్యాంకనంలో పాల్గొనే ఉపాధ్యాయులకు చల్లని నీరు, మజ్జిగ తదితర సౌకర్యాలను సమకూర్చాలని కోరారు. పదోతరగతికి పాఠాలు బోధించే ఉపాధ్యాయులను మొదటి ప్రాధాన్యతగా విధుల్లోకి తీసుకోవాలని, సీనియారిటీని దృష్టిలో ఉంచుకుని విధులు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో పి. శేషగిరిరావు, జిల్లా అధ్యక్షుడు ఎం. గంగరాజు, జిల్లా కార్యదర్శి సురేంద్ర పాల్గొన్నారు.

వలంటీర్లను టెర్రరిస్టులతో పోల్చడం దారుణం

ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారరెడ్డి

వాల్మీకిపురం : ఆంధ్రప్రదేశ్‌లోని ప్రజలకు విశేష సేవలందిస్తూ.. పలువురి మన్ననలు పొందుతుంటే వారిని టెర్రరిస్టులతో పోల్చడం కూటమి నేతల దుష్ట పన్నాగాలకు నిదర్శనమని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వలంటీర్లను చూస్తే చంద్రబాబుతో పాటు టీడీపీ, జనసేన నేతల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయన్నారు. తాము అధికారంలోకి వస్తే వలంటీర్ల కథ తేలుస్తాం అని బెదిరించడం, వలంటీర్ వ్యవస్థ వలన విపక్షాల జేబులు నిండడం లేదనే కడుపులు మండుతున్నాయన్నారు. గౌరవ వేతనంతో పని చేస్తూ ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు అధికారులకు తెలియజేస్తూ.. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ ప్రజల గుండెల్లో ముద్ర వేసుకున్న వలంటీర్లను ఉగ్రవాదులు, జిహాదీలు, స్లిపర్ సెల్స్‌తో పోల్చుతూ అత్యంత అవమానకరంగా మాట్లాడడం సబబుకాదన్నారు. కోవిడ్ మహమ్మారి సమయంలో టీడీపీ నేతలు హాయిగా నిద్రపోతుంటే రాష్ట్ర వ్యాప్తంగా గడప గడపకూ వెళ్లి వలంటీర్లు సేవలందించారన్నారు. కులం, మతం, ప్రాంతం చూడకుండా ఎలాంటి వివక్ష లేకుండా ప్రజలకు సేవ చేయడం టెర్రరిజం కాదన్నారు. జన్మభూమి కమిటీల వలే కాకుండా నేరుగా వయస్సు మళ్లిన వృద్ధులకు ఇంటి దగ్గరకు వెళ్లి తలుపులుతట్టి ఫించన్ అందించడం జిహాదీ కాదన్నారు. వలంటీర్లపై అత్యంత నీచమైన వ్యాఖ్యాలు చేసిన టిడిపి, జనసేన వ్యాఖ్యాలను వెనక్కితీసుకొని, వలంటీర్లకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఉపసర్పంచ్ కేశవ రెడ్డి, కోఆప్షన్ సభ్యులు మహబూబ్‌బాషా, మాజీ సర్పంచ్ సురేష్ రెడ్డి, నాయకులు శంకర్ రెడ్డి, సుధాకర, శ్యామ్, రవి, రఘు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రథోత్సవం



చెంబకూరులో స్వామివారి రథం ఊరేగింపు

రామసముద్రం : రామసముద్రం మండలం చెంబకూరు శ్రీగట్టు వెంకటరమణస్వామి తిరునాలలో భాగంగా మంగళవారం స్వామివారి రథోత్సవం వైభవంగా నిర్వహించారు. రథోత్సవంతో పురవీధులు భక్తులతో గోవింద నామస్మరణతో పోటెత్తింది. అలాగే అర్చకులు, కార్యనిర్వాహకులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, తేరులో పురవీధులలో ఊరేగించారు. భక్తులు స్వామివారి రథం లాగడానికి తండోపతండాలుగా తరలివచ్చారు. గజ్జలవారిపల్లెకు చెందిన కోవా కృష్ణమూర్తి భక్తులకు మజ్జిగ, గులాబ్‌జాం పంపిణీ చేశారు. చుట్టు పక్కల గ్రామాలకు చెందిన భక్తులు పానకాలు పంపిణీ చేశారు.

పారదర్శకంగా ఎన్నికల విధులు



మాట్లాడుతున్న ఆర్వో హరిప్రసాద్

మదనపల్లె : ఉద్యోగులు ఎన్నికల నిబంధనలకు లోబడి విధులను నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించాలని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి హరిప్రసాద్ అన్నారు. మంగళవారం సబ్ కలెక్టరేట్‌లో ఫ్లయింగ్ స్క్వాడ్, వీడియో సర్వైలెన్స్, ఎక్స్‌పెండిచర్ టీమ్ సభ్యులు... నిర్వర్తించాల్సిన విధులపై అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆర్వో హరిప్రసాద్ మాట్లాడుతూ.. పారదర్శకంగా ఎన్నికల నిర్వహణ కోసం ఏర్పాటుచేసిన ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు ఎన్నికల సందర్భంగా జరుగుతున్న ఉల్లంఘనలు, నగదు, మద్యం పంపిణీని గుర్తించడం, రిపోర్ట్‌చేయడం, ఆధారాలు సేకరించడం, రికార్డు చేయడం చాలా కీలకమన్నారు. సీ-విజిల్ యాప్, 1950 టోల్ ఫ్రీనెంబర్, ఇతర మార్గాల ద్వారా వచ్చే సమాచారాన్ని బట్టి ఎన్నికల సమయంలో అక్రమడబ్బు, నగదు సరఫరా జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికలకు సంబంధించి అక్రమ నగదు, మద్యం పంపిణీ అరికట్టడమే మన లక్ష్యమని, సాధారణ ప్రజలకు అసౌకర్యం కలగకుండా, వీలైనంత వరకు జాగ్రత్తలు వహించాలన్నారు. నగదు సీజ్ చేసే సమయంలో ఎన్నికల కమిషన్ నిర్దేశించిన మార్గదర్శకాలను తప్పకుండా పాటించాలని, అలాగే ఎక్కడ అప్పీల్ చేయాలనే అంశంపై స్పష్టంగా తెలియజేస్తూ రసీదు అందించాలన్నారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘనలపై అప్రమత్తంగా ఉంటూ ఆధారాలు సేకరించాలని సూచించారు. సమావేశంలో కమిషనర్ ప్రమీల, తహసీల్దార్ రమాదేవి, బాలాజీరాజు, తాలూకా సీఐ ఎస్.శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత అవకాశాలకు గేట్ 'వే'

కురబలకోట : ఇంజినీరింగ్ విద్యార్థుల ఉజ్వల భవితకు, ఉన్నత అవకాశాలకు గేట్ ఎగ్జామ్ ఎంతో ప్రాముఖ్యత కలిగి ఉందని బెంగళూరు డీఆర్‌డీఓ సైంటిస్ట్ డాక్టర్ ఎస్ఎస్ రెడ్డి అన్నారు. అంగళ్లులోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం ఇంజినీరింగ్ విభాగంచే కేరీర్ డెవెలప్మెంట్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి గేట్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన తర్వాత అగ్రశ్రేణి సంస్థల్లో ప్రవేశం పొందవచ్చన్నారు. పేరొందిన కంపెనీలలో నేరుగా ఉద్యోగాలు సాధించవచ్చన్నారు. అంతేగాకుండా ప్రతిష్టాత్మక ఐఐఎస్‌సీ, ఐఐటీ,నిట్ వంటి సంస్థల్లో ఎంఈ, ఎంటెక్ ఇంటిగ్రేటెడ్ పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశం పొందవచ్చన్నారు.

వైభవంగా హుస్సేన్ వల్లి ఉరుసు

పెండ్లిమర్రి : మండలంలోని మొయిళ్లకాల్వ గ్రామంలో వెలసిన శ్రీ హజరత్ హుస్సేన్ వల్లి ఉరుసు, శ్రీనారాయణస్వామి ఆరాధన ఉత్సవాలు మంగళవారం దర్గా కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి స్వామివారికి పూజలు చేసి దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

రసవత్తరంగా బండలాగుడు పోటీలు

ఉరుసు ఉత్సవాల సందర్భంగా ఆలయ అవరణలో బండలాగుడు పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి ప్రారంభించారు. ముందుగా ఆయన నారాయణ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.